## మల్లారెడ్డి అఫిడవిట్‌పై పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌పై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. నామినేషన్ సందర్భంగా మల్లారెడ్డి తన విద్యార్హతకు సంబంధించి అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని, ఆయనపై తగిన చర్య తీసుకోవాలని కోరుతూ ఈ నెల 13న రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని పేర్కొంటూ కందాడి అంజిరెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదన.. వినిపిస్తూ మల్లారెడ్డి అఫిడవిట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేస్తే రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకోలేదని చెప్పారు. దీంతో రిటర్నింగ్ అధికారిపై చర్య తీసుకోవాలని కోరుతూ ఈ-మెయిల్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు వివరించారు. దీనిపై ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ స్పందిస్తూ.. పిటిషనర్ ఇచ్చిన ఫిర్యాదుపై రిటర్నింగ్ అధికారి ఈ నెల 15న నిర్ణయాన్ని వెల్లడించినట్టు చెప్పారు. దీంతో అంజిరెడ్డి పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ హైకోర్టు తుది ఉత్తర్వులు జారీ చేసింది. రిటర్నింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలన్న విన్నపాన్ని తోసిపుచ్చుతూ ఫిర్యాదుపై నిర్ణయం తీసుకున్నందున ఆయనపై చర్యలు చేపట్టాలన్న ప్రశ్నే ఉత్పన్నం కాదని పేర్కొన్నది. రిటర్నింగ్ అధికారి వెలువరించిన ఉత్తర్వులపై అభ్యంతరాలుంటే ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవచ్చని పిటిషనర్‌కు స్పష్టం చేసింది.

## స్వతంత్ర అభ్యర్థి పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు ఆమోదించారో లేదో ఎన్నికల అధికారులు స్పష్టం చేయలేదని పేర్కొంటూ మిర్యాలగూడ స్వతంత్ర అభ్యర్థి శ్రీకాంత్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై శనివారం విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదన వినిపిస్తూ.. నామినేషన్ దాఖలు సందర్భంగా పిటిషనర్ రూ.10 వేల డిపాజిట్ సొమ్ము చెల్లించలేదని తెలిపారు. దీంతో ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.





నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం రెంజల్ మండలం సాటాపూర్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే షకీల్. కార్యక్రమానికి హాజరైన ప్రజలు

## మూడు గంటల కాంగ్రెస్ కావాలా?

# 24 గంటల బీఆర్ఎస్సా?

### కాంగ్రెస్‌కు ఓటేసి గోస పడొద్దు

- కర్ణాటక రైతులు ఆగమైతున్నరు
- కరెంటు లేక పంటలెండుతున్నయ్
- 3 గంటల్లో 30 సార్లు ట్రిప్పులు
- ఆ పరిస్థితి మనం తెచ్చుకోవద్దు
- ముస్లింలను పట్టించుకోని కాంగ్రెస్
- బీఆర్ఎస్‌తోనే మరింత బాగైతం
- సీఎం కేసీఆర్ హయాంలోనే నిజాంసాగర్ కాల్వల ఆధునీకరణ
- బోధన్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ రోడ్‌షోల్లో హరీశ్‌రావు

బోధన్/మాక్లూర్/నందిపేట్, నవంబర్ 18: కాంగ్రెస్ పాలన వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవని, ఒకనాడు రైతులు కరెంట్ కోసం ఎంతో గోస పడ్డారని, మళ్లీ ఆ కష్టాలు రాకూడదని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 3 గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలో, 24 గంటల కరెంటిచ్చి రైతులను ఆదుకొనే బీఆర్ఎస్ కావాలో ప్రజలు ఆలోచించాలని సూచించారు. 'కాంగ్రెసోళ్లు కొత్త కొత్త మ్యానిఫెస్టోలతో వస్తున్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో 3-4 గంటల కరెంట్ కూడా ఇవ్వటం లేదు. ఆ సమయంలోనూ 20 నుంచి 30 సార్లు ట్రిప్ అవుతున్నది. ఇలా కరెంట్ ఇస్తే మన రైతులు బతుకుతారా? ఈ ట్రిప్పుల కరెంటు తిప్పలు మనకొద్దు' అని పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఉచిత కరెంట్ అంటూ ఉత్తుత్తి కరెంట్ ఇచ్చారని, ఏ రాత్రి వస్తుందో తెలియని కరెంట్ కోసం రైతులెందరో బావుల దగ్గర, పాములు, తేళ్లు కుట్టి ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తుచేశారు. శనివారం నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించిన హరీశ్‌రావు.. బోధన్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో ప్రసంగించారు. 'కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంట్ ఇస్తే మూడు ఎకరాలు పారుతాయని అంటున్నాడు. మరి 3 గంటల కరెంట్ సరిపోతుందా? బీఆర్ఎస్ పాలనలో కరెంట్‌తో పాటు రైతుబంధు, రైతుబీమా ఇస్తున్నాం. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుతున్నాయి. పండిన ప్రతి గింజను కొంటున్నాం. కాంగ్రెస్‌కు ఓటేసి కర్ణాటక లెక్క ఆగమాగం కావొద్దు' అని ఓటర్లను కోరారు.

### మన బతుకులను రిస్క్‌లో పెట్టొద్దు

అరవై ఏండ్ల పాలనతో మనల్ని ఆగం జేసిన కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం మళ్లీ కొత్త కొత్త హామీలతో ముందుకు వస్తున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేసి రిస్క్ తెచ్చుకోవద్దని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఓట్లు వేయించుకొని ఢిల్లీలో కూర్చుంటారని, బీఆర్ఎస్ పార్టీ మన ఇంటి పార్టీ అని ఎప్పుడూ తెలంగాణలోనే ఉండి ప్రజలకు సేవలందిస్తుందని వివరించారు. గ్యారెంటీలతో కర్ణాటక ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక రాహుల్‌గాంధీ జాడలేడు, ప్రియాంక గాంధీ పత్తా లేదని, అక్కడి ప్రజలు లబోదిబోమంటున్నారని వెల్లడించారు.


### ముస్లింల అధోగతికి కాంగ్రెస్సే కారణం

ముస్లింల పేదరికానికి 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనే కారణమని, ఆ పార్టీ పాలనలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ఎలాంటి కృషి జరగలేదని హరీశ్‌రావు విమర్శించారు. కొద్దిసేపు ఉర్దూలో మాట్లాడిన ఆయన.. కేసీఆర్ సెక్యులర్ లీడర్ అని, బీఆర్ఎస్ పాలనలో ఎక్కడా మతకలహాలు జరగలేదని అన్నారు. మైనార్టీ పిల్లల విద్య కోసం 204 రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటుచేశామని, విదేశాల్లో చదువు కోసం రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. 10 వేల మంది ఇమామ్‌లకు నెలకు రూ.5 వేలు చొప్పున ఇస్తున్నామని, మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సహాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల కోసం పని చేస్తున్న ఎమ్మెల్యేలు షకీల్, బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### కేసీఆర్ అంటే ప్రజలకు నమ్మకం

కేసీఆర్ అంటే ఒక నమ్మకమని, ప్రజలకు కేసీఆర్ పట్ల విశ్వాసముందని, ప్రతి ఒక్క హామీని కూడా కేసీఆర్ అమలుచేశారని హరీశ్‌రావు అన్నారు. ఓట్ల కోసం, ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన మ్యానిఫెస్టో ఝూటా మ్యానిఫెస్టో అని ధ్వజమెత్తారు. ఆ మ్యానిఫెస్టోను నమ్మితే కర్ణాటక ప్రజలకు పట్టిన గతే మనకూ పడుతుందని హెచ్చరించారు. బీడీ కార్మికులను పరేషాన్ చేస్తూ కాంగ్రెస్ పుర్రె గుర్తు పెడితే, బీజేపీ జీఎస్టీ తెచ్చిందని గుర్తుచేశారు. ఇండియాటుడే సర్వేలో కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని స్పష్టమైందని పేర్కొన్నారు.

## లోకం పోకడ




## పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ పూర్తి

- ముమ్మరంగా ఈసీ తనిఖీలు

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): దివ్యాంగులు, వృద్ధులు, ఉద్యోగుల కోసం 28 వేల పోస్టల్ బ్యాలెట్ల ముద్రణను అధికారులు శనివారం పూర్తిచేశారు. 22 కల్లా ఈవీఎంల తనిఖీలు పూర్తి చేయాలని ఈసీ ఆదేశించగా, అధికారులు ముమ్మర చర్యలు తీసుకుంటున్నారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌లను నియోజకవర్గాలకు కేటాయించేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల కమిషన్‌కు వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.603 కోట్ల విలువైన నగదు, నగలు, ఇతర వస్తువులను పట్టుకున్నారు. అలాగే, వివిధ పార్టీల స్టార్ క్యాంపెయినర్ల జాబితాను అధికారులు విడుదల చేశారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 13.2°c | 37.1°c |
| నల్లగొండ | 19.0°c | 35.6°c |
| మెదక్ | 16.2°c | 34.7°c |
| రంగారెడ్డి | 15.2°c | 34.0°c |
| ఖమ్మం | 22.0°c | 33.0°c |
| మహబూబ్‌నగర్ | 21.7°c | 32.1°c |
| కరీంనగర్ | 20.0°c | 32.0°c |
| వరంగల్ | 21.0°c | 32.0°c |
| నిజామాబాద్ | 19.3°c | 31.9 °c |
| హైదరాబాద్ | 20.5°c | 31.5°c |

# 'చెయ్యి'చ్చే హామీలే!

- గెలవాలన్న దురాశ తప్ప.. చిత్తశుద్ధిలేదు
- 43 హామీల విలువ 5 లక్షల కోట్లు
- ఛత్తీస్‌గఢ్, హిమాచల్, బీహార్ వంటి ఇండియా కూటమి రాష్ట్రాల బడ్జెట్ తెచ్చినా హామీల అమలుకు సరిపోదు
- కర్ణాటక గ్యారెంటీల విలువ 62 వేల కోట్లు
- వాటినే అమలు చేయలేక చేతులెత్తేసిన హస్తంపార్టీ
- అబద్ధపు హామీలతో తెలంగాణ ప్రజల్ని మోసపుచ్చే కుట్ర

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఏంచేసైనా గెలవాలి. అధికారాన్ని చేపట్టాలి. అందుకోసం ఎలాంటి హామీలనైనా గుప్పించాలి. వాటి అమలుకు నిధులు సరిపోతాయా? లేదా? అనేది అవసరమే లేదు. ఒక్కసారి గద్దెనెక్కాక తీరిగ్గా హామీల అమలును అటకెక్కించాలి. చిత్తశుద్ధిలేని కాంగ్రెస్ పార్టీ ఇటీవల కర్ణాటకలో అమలుచేసిన విధానమిదే. ఇప్పుడు తెలంగాణలోనూ ఇదే కుట్రకు తెరతీసింది. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో గుప్పించిన 43 హామీల అమలు ఎలా సాధ్యమన్న చర్చ మేథోవర్గాల్లో పెద్దయెత్తున జరుగుతున్నది. ఆరు గ్యారెంటీలు సహా హామీలన్నింటిని అమలు చేయాలంటే రూ. 5 లక్షల కోట్ల వరకూ ఖర్చు అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూ.2.9 లక్షల కోట్లే. మరి కాంగ్రెస్ హామీలు అమలు చేయాలంటే అదనంగా మరో రూ. 2.1 లక్షల కోట్లు కావాలి. వీటికి అదనంగా ఉద్యోగుల వేతనాలు, ప్రభుత్వ ఖర్చులు తదితర వాటిని లెక్కిస్తే మొత్తంగా మరో రూ.4.1 లక్షల కోట్ల వరకు అప్పులు చేయాల్సి ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ఆ రాష్ట్రాల బడ్జెట్‌లు కూడా సరిపోవు


కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల బడ్జెట్‌లను కలిపినప్పటికీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రకటించిన హామీలను నెరవేర్చడం సాధ్యమయ్యే పనికాదని నిపుణులు చెప్తున్నారు. కాంగ్రెస్‌పాలిత ఛత్తీస్‌గఢ్ బడ్జెట్ రూ. 1.21 లక్షల కోట్లు, హిమాచల్‌ప్రదేశ్ బడ్జెట్ రూ. 53,413 కోట్లు, ఇండియా కూటమి అధికారంలో ఉన్న బీహార్ బడ్జెట్ రూ. 2.61 లక్షల కోట్లు. ఈ మూడు రాష్ట్రాల మొత్తం బడ్జెట్ విలువ రూ. 4.3 లక్షల కోట్లు దాటట్లేదు. అయితే, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని అన్ని హామీలను సంపూర్ణంగా అమలు చేయాలంటే ఏటా రూ. 5 లక్షల కోట్లు కావాలి. ఉద్యోగుల వేతనాలు, ప్రభుత్వ ఖర్చుల కోసం మరో రూ. 2.1 లక్షల కోట్లు అవసరమౌతాయి. ఇది సాధ్యంకాని పని. ప్రజలను మోసగించి అధికారంలోకి రావడానికే కాంగ్రెస్ బూటకపు హామీలను గుప్పించిందని తెలంగాణ మేధావులు మండిపడుతున్నారు.

### ఎగ్గొట్టాలన్న ఉద్దేశమే!

5 గ్యారెంటీల పేరుచెప్పి కర్ణాటకలో ఇటీవల పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ఆ హామీల అమలులో ఘోరంగా విఫలమైంది. 5 గ్యారెంటీలను అమలు చేయాలంటే ఎన్ని నిధులు అవసరమైతాయి? అన్న దానిపై పెద్దగా కసరత్తు చేయలేదని, ఎగ్గొట్టాలన్న ఉద్దేశంతోనే ఆ హామీలు ఇచ్చి ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కర్ణాటకలో 5 గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేయాలంటే ఏటా ప్రభుత్వ ఖజానాపై రూ. 62 వేల కోట్లకు పైగా భారం పడుతుంది. మొత్తం బడ్జెట్‌లో ఇది దాదాపు 20 శాతం. ఐదు గ్యారెంటీలతో అర చేతిలో వైకుంఠం చూపించి తమను కాంగ్రెస్ బురిడీ కొట్టించిందని అర్థమైపోవడంతో కన్నడ ప్రజలు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. కర్ణాటక తరహాలో తెలంగాణలో గెలిపిస్తే అదనంగా మరోటి కలిపి ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ మాటలు నమ్మితే గోస తప్పదని తెలంగాణ ప్రజానీకాన్ని హెచ్చరిస్తున్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ కత్తిపోట్లు

- ముగ్గురిని పొడిచిన హస్తం పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు భీమ్‌దాస్
- ఘటనలో ఒకరి పరిస్థితి విషమం.. నిజామాబాద్ దవాఖానకు తరలింపు
- వాట్సాప్ గ్రూప్ నుంచి తీసేసినందుకే



గాయపడిన హైమద్



కత్తిపోట్లకు గురైన రజాక్

గాంధారి, నవంబర్ 18: ముగ్గురు బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకుడు కత్తితో దాడిచేశాడు. వాట్సాప్ గ్రూప్ నుంచి తమను ఎందుకు తొలగించావని ప్రశ్నించిన పాపానికి ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. విచక్షణారహితంగా కత్తితో పొడవడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గండివేట్ గ్రామ సమాచారం చేరవేసుకునేందుకు గ్రామస్థులు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు భీమ్‌దాస్.. ఈ గ్రూప్ నుంచి శనివారం బీఆర్ఎస్ కార్యకర్తను తొలగించాడు. బీఆర్ఎస్‌కు చెందిన హైమద్, రజాక్, జావేద్.. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కనిపించిన భీమ్‌దాస్‌ను వాట్సాప్ గ్రూప్ నుంచి తమను ఎందుకు తీసేశావని ప్రశ్నించారు. ఈ క్రమంలో మాటమాట పెరిగి వాగ్వాదం చోటుచేసుకున్నది. భీమ్‌దాస్ అప్పటికే జేబులో దాచుకున్న కత్తిని తీసి ఆ ముగ్గురిపై దాడిచేశాడు. విచక్షణారహితంగా పొడవడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇది గమనించిన గ్రామస్థులు క్షతగాత్రులను తొలుత బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఛాతిపై గాయాలైన హైమద్ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు ఆయనను నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. మిగిలిన ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. మరోవైపు, బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడికి పాల్పడిన భీమ్‌దాస్‌ను అదే పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు చితకబాదారు. గాయపడిన అతడిని ఎల్లారెడ్డి దవాఖానకు తరలించారు.

### మదన్‌మోహన్‌ను అరెస్టు చేయాలి: జాజాల

ప్రశాంతంగా ఉన్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు హింసను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. ఈ ఘటనలో మదన్‌మోహన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ దవాఖానలో బాధితులను పరామర్శించిన ఆయన మదన్‌మోహన్‌తోపాటు అతడి అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మదన్‌మోహన్ రౌడీషీటర్లను వెంటేసుకొని తిరుగుతున్నారని బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆరోపించారు.

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### ఎయిమ్స్‌లో...

దేశవ్యాప్తంగా ఉన్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లలో నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 3036
- పోస్టులు: అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజినీర్, లాండ్రీ సూపర్‌వైజర్, ఆడియోలజిస్ట్, బయో మెడికల్ ఇంజినీర్, హిందీ ట్రాన్స్‌లేటర్, లీగల్ అసిస్టెంట్ తదితరాలు
- ఎంపిక: కామన్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ ఫర్ ఎయిమ్స్ (సీఆర్ఈ-ఎయిమ్స్) -2023 ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 1
- వెబ్‌సైట్: https://aiimsexams.ac.in

### సీసీఎంబీలో..

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 10
- పోస్టులు: సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్, ప్రిన్సిపల్ సైంటిస్ట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 15
- వెబ్‌సైట్: www.ccmb.res.in

### యూపీఎస్సీ..

కేంద్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 3
- పోస్టులు: అసిస్టెంట్ డైరెక్టర్ (అగ్రికల్చర్), డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 30
- వెబ్‌సైట్: https://www.upsconline.nic.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, జనరల్ స్టడీస్ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# కాంగ్రెస్ కట్టల కుట్రలు!

- ఓటర్లను కొనేందుకు రూ.7.4 కోట్లు
- అప్పా జంక్షన్‌లో పోలీసులకు దొరికిన పొంగులేటి అనుచరులు
- ఆరు కార్ల కాన్వాయ్‌లో నగదు తరలింపు
- కార్లన్నీ పొంగులేటి బంధువులవే
- రంగంలోకి ఐటీ.. 'శ్రీనిధి'లో సోదాలు



హైదరాబాద్, హైదరాబాద్ సిటీబ్యూరో/మొయినాబాద్ నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : 'ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థిని అసెంబ్లీ గేట్ కూడా తాకనివ్వను' అని బహిరంగ సవాల్ చేసిన కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 'ధన రాజకీయం' బయటపడిందా? ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్‌కు లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని పొంగులేటి.. ఓటర్లను కొనేందుకు ప్రయత్నిస్తూ అడ్డంగా దొరికిపోయినట్టు తెలుస్తున్నది. పొంగులేటి అనుచరులు శనివారం హైదరాబాద్ నుంచి ఖమ్మం తరలిస్తున్న 7.4 కోట్ల రూపాయల 'క్యాష్ కాన్వాయ్'ని పోలీసులు అడ్డగించి, సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

### పక్కా సమాచారంతో తనిఖీలు

పోలీసులకు అందిన పక్కా సమాచారంతో మొయినాబాద్ పీఎస్ పరిధిలోని అజీజ్‌నగర్ అప్పా జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ వెనుక వైపు నుంచి కాన్వాయ్‌గా వస్తున్న ఆరు కార్లను ఆపి తనిఖీలు జరిపారు. ఈ తనిఖీలలో కాన్వాయ్ మధ్యలో ఉన్న టీఎస్09ఈడబ్ల్యూ 3747 నంబర్ కారులో రూ.7.4 కోట్ల నగదు బయటపడింది. దీంతో పోలీసులు కార్లతో పాటు అందులో లభించిన నగదును సీజ్‌చేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నట్టు రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. డబ్బు ఒకే కారులో లభించిందని, మిగిలిన అయిదు కార్లు దానికి పైలట్‌గా, కాన్వాయ్‌గా వచ్చాయని తెలిపారు. ఈ కార్లు శ్రీనిధి ఇంటర్నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ కేటీ మహి నివాసం నుంచి వస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. డబ్బుతో దొరికిన ఆరు కార్లు పొంగులేటి కార్యాలయం, ఆయన బంధువుల పేర్లపై రిజిస్టర్ అయినట్టు తెలుస్తున్నది. కాగా, ఉమ్మడి ఖమ్మానికి చెందిన బీఆర్ఎస్ నేతలపై కక్ష కట్టిన పొంగులేటి ఏ ఒక్కరినీ అసెంబ్లీ గేటు తాకకుండా అడ్డుకుంటానని శపథం చేశారు. కానీ సీన్ రివర్స్ అయి.. ఉమ్మడి ఖమ్మం వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో పాలేరు నియోజకవర్గంలో తన ఓటమి కూడా ఖాయమని తేలిపోయింది. దీంతో డబ్బును ఆశచూపి ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆయన ప్రయత్నించినట్టు తెలుస్తున్నది. అందుకే ఈ డబ్బును ఖమ్మం తరలించి ఓటర్లకు పంచేందుకు ప్రయత్నించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

### నగదుతో పట్టుబడిన క్యాష్ కాన్వాయిలోని కార్ల వివరాలు

| కారు నంబర్ | యజమాని పేరు | చిరునామా |
|---|---|---|
| 1.టీఎస్09ఇడబ్ల్యూ3747 | ఆర్ రఘురామ్‌రెడ్డి | #8-2-326/4/ఆర్/3ఎ, బంజారాహిల్స్ రోడ్‌నెం-3. |
| 2. టీఎస్07జెకె4688 | సౌఖ్య డెవలపర్స్ | #4-147/29, ఓమ్‌నగర్ కాలనీ, కిస్మత్‌పూర్ |
| 3. టీఎస్36కె3030 | పీ ప్రవీణ్‌రెడ్డి | #2-72, తీగలకుంటపల్లి, కొహెడ |
| 4. టీఎస్02ఎఫ్ఇ8332 | వై చంద్రశేఖర్‌రెడ్డి | #4-26, మామిడిపల్లె, వీణవంక |
| 5.టీఎస్09జబి5841 | రాఘవ ప్రాజెక్ట్స్ | #8-2-603/1/27 28రాఘవ ప్రైడ్, కృష్ణపురం, ఎస్‌టీఆర్, రోడ్‌నెం-10, బంజారాహిల్స్ |

### ఆ రూ.7.4 కోట్ల డబ్బు ఎక్కడిది?

ఈ నెల 9, 10 తేదీల్లో పొంగులేటికి చెందిన ఇండ్లు, ఆఫీసులు, బంధువుల ఇండ్లలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. అయితే, తన డబ్బు పంపిణీపై ఐటీ అధికారుల నజర్ ఉందని తెలుసుకున్న పొంగులేటి 3 రోజుల ముందే తన అక్రమ డబ్బును, కాంగ్రెస్ టికెట్ల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బును దాచేసినట్టు తెలుస్తున్నది. ఐటీ అధికారుల సోదాల్లో తన 'పర్సనల్ రూమ్'లో లెక్కా పత్రం లేని 3 బ్యాగుల డబ్బు లభించింది. ఆ డబ్బు తనదేనని 10వ తేదీ అర్ధరాత్రి వరకు ఒప్పుకోని పొంగులేటి.. ఐటీ అధికారులు ఆధారాలు చూపించడంతో అంగీకరించక తప్పలేదు. పైగా ఇదంతా బీఆర్ఎస్ కుట్ర అంటూ అధికార పార్టీపై రుద్దే ప్రయత్నం చేశారు. శనివారం దొరికిన డబ్బులో రేవంత్‌రెడ్డి టికెట్ల అమ్మకం వాటా కూడా ఉన్నట్టు సమాచారం.

### శ్రీనిధి విద్యా సంస్థల్లో ఐటీ సోదాలు

ఎన్నికల అధికారుల తనిఖీల్లో శనివారం దొరికిన రూ.7.4 కోట్ల వెనుక పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీప బంధువు ఆర్ రఘురామ్‌రెడ్డి పాత్ర ఉన్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. భారీ స్థాయిలో నగదు లభ్యం కావడంతో పోలీసులు వెంటనే ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు ఆ డబ్బును తరలిస్తున్న వ్యక్తులు ఇచ్చిన సమాచారం ఆధారంగా సోదాలు ప్రారంభించారు. శ్రీనిధి విద్యా సంస్థల చైర్మన్ కేటీ మహి ఇంట్లో, అతనికి చెందిన క్రికెట్ అకాడమీ, ఫుట్‌బాల్ అకాడమీ కార్యాలయాల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. డబ్బుతో పట్టుబడిన కార్లలో రాఘవ ప్రైడ్, రాఘవ ప్రాజెక్ట్స్, సౌఖ్య డెవలపర్స్‌కు చెందిన కార్లు ఉన్నాయి. ఈ కార్లు రఘురామ్‌రెడ్డికి చెందినవిగా నిర్ధారించారు. ఆదివారం ఈ డబ్బు తరలింపునకు సహకరించిన వారి గురించి ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే డ్రైవర్‌తో పాటు అందర్నీ అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఏ ప్రాంతానికి డబ్బు తరలిస్తున్నారు? దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? ఎవరి ప్రోద్బలంతో ఇంత పెద్దమొత్తంలో నగదు రవాణా జరుగుతున్నది? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.